క్లుప్తంగా

రేషన్‌డీలర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రేషన్‌డీలర్లు

లక్సెట్టిపేట: మండలంలోని రేషన్‌డీలర్లకు కమీషన్ రావడం లేదని సోమవారం రేషన్‌డీలర్లు స్థానిక ఐబీ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీలర్ల అధ్యక్షుడు మోటపల్కుల సత్తయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్‌డీలర్లకు పంపిణీ చేసినటువంటి ఉచిత బియ్యానికి సంబంధించిన ఐదు నెలల కమీషన్ ఇప్పటికీ రాలేదన్నారు. కమీషన్లు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని అధికారులు, ప్రభుత్వం పట్టించుకొని కమీషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్లు పల్లేర్ల మనోహర్, బాపన్న, రామస్వామి పాల్గొన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇస్తే చర్యలు

తాండూర్: మైనర్లకు వాహనాలు ఇచ్చినా, మైనర్లు వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని తాండూర్ సీఐ దేవయ్య హెచ్చరించారు. తాండూర్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కాలంలో మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాలే అధికంగా ఉన్నాయన్నారు. ఇకపై లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మాదారం ఎస్సై సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోడు భూములకు రుణాలివ్వాలి



నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

వేమనపల్లి: పోడు పట్టాలు కలిగిన ఆదివాసీ రైతులకు పంట పెట్టుబడి కోసం రుణాలివ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పున్నం అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద టీఏజీఎస్ నాయకులతో కలిసి సోమవారం ప్రపంచ ఆదివాసీ వారోత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరించారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని, జీవో 49పూర్తిగా రద్దు చేయాలని, ఆదివాసీ గూడాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఏజీఎస్ మండల అధ్యక్షుడు మధునయ్య, నాయకులు వెంకన్న, నాగమల్లు, కమల, మధునయ్య, మల్లేశ్, పుల్లయ్య, పోశం తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. సరిచేశారు



భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ కంచె ధ్వంసం కావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు 'రక్షణ కంచె సరిచేయరూ..!' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురించగా విద్యుత్ శాఖ ఏఈ శంకర్ స్పందించారు. సిబ్బందితో పాటు ఆయన వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె సరిచేయించారు.

సాక్షి ఎఫెక్ట్..

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: ఈ నెల 2నుంచి 22వరకు మేడ్చల్‌లో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లను సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలకు 33జిల్లాల నుంచి 600మంది ప్రతినిధులు హాజరవుతారని ఈ సభల్లో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, వివిధ అంశాలపై తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇప్పకాయల లింగయ్య, మిట్ట పల్లి పౌల్, నక్క వెంకటస్వామి, సాంబయ్య, గోపి, మొండి తదితరులు పాల్గొన్నారు.

ఆరంభంతో ఆశలు.. ఆగిపోవడంతో ఆవిరి



బోయపల్లి-బుగ్గగూడెం వరకు పూర్తైన రోడ్డు



అసంపూర్తిగా వదిలేయడంతో బురదమయమైన రోడ్డు

- నిలిచిన బోయపల్లి-బుగ్గ రోడ్డు నిర్మాణం
- నిధులు సరిపోలేదని అర్ధంతరంగా నిలిపివేత
- అసంపూర్తి పనులతో మరిన్ని కష్టాలు...

తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామం నుంచి బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయం (గోండుగూడెం) వరకు రోడ్డు నిర్మాణం దశాబ్దాల కలగా ఉండేది. ఈ కల సాకారమవుతుందనే ఆనందంతో ప్రజలు ఉప్పొంగిపోయారు. గతేడాది ప్రారంభమైన రోడ్డు పనులు చురుగ్గా సాగుతుండగా, అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్రజల ఆనందం ఆవిరైంది. నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోవడంతో ప్రయాణికులు, భక్తులు, సింగరేణి కార్మికుల రవాణా ఇబ్బందులు మళ్లీ మొదలయ్యాయి.

- తాండూర్

రూ.2.40 కోట్లతో 2.8 కిలోమీటర్లు..

జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న బోయపల్లి నుంచి గోండుగూడెం వరకు 2.8కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా రూ.2.40కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డు పూర్తయితే బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయ భక్తులు, కాసిపేట-1, కాసిపేట-2 ఇంక్లైన్ గనులకు వెళ్లే సింగరేణి కార్మికులు, గోండుగూడెం గ్రామస్తులు రవాణా ఇబ్బందుల నుంచి విముక్తి పొందుతారు. అయితే, పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఈ ఆశలు మళ్లీ భంగపడ్డాయి.

అంచనాల తప్పిదం..

రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వర్టులు, గోండుగూడెం గ్రామంలో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. అయితే, కేవలం 2 కిలోమీటర్ల నిర్మాణానికే రూ.2.40కోట్లు ఖర్చయినట్లు తెలుస్తోంది. గోండుగూడెం సమీపంలోని కల్వర్టు నిర్మాణానికి అంచనాలకు మించి నిధులు వెచ్చించడంతో, అంచనా వ్యయానికి, వాస్తవ వ్యయానికి సుమారు రూ.80లక్షల వ్యత్యాసం ఏర్పడింది. సాంకేతికంగా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అధికారులు అంచనాలు తయారు చేయడంలో చూపిన నిర్లక్ష్యం ఈ సమస్యకు కారణమైనట్లు తెలుస్తోంది. దీంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

అదనపు నిధులే పరిష్కారం..

తాండూర్ మండలం బోయపల్లి నుంచి బెల్లంపల్లి మండలం గోండుగూడెం వరకు సాగిన ఈ రోడ్డు పనులు నిధుల కొరతతో ఆగిపోయాయి. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా అదనపు నిధులు మంజూరైతేనే పనులు పునఃప్రారంభమయ్యే అవకాశం ఉంది. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ, ఇప్పటివరకు వాటికి ఆమోదం లభించలేదు. అధికారులు, నాయకులు ఈ సమస్యపై దృష్టి సారించి, రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ఈ రోడ్డు పూర్తయితే భక్తులు, ప్రయాణికులు, కార్మికుల రవాణా ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయి.

ప్రతిపాదనలు పంపించాం

బోయపల్లి-బుగ్గ గ్రామం రోడ్డు నిర్మాణం కోసం అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. ముందు అనుకున్నట్లు కాకుండా కల్వర్టు నిర్మాణంలో మార్పులు చేపట్టడంతో నిధులు సరిపోలేదు. నిధులు మంజూరు కాగానే రోడ్డు పనులు పూర్తి చేస్తాం.

- సాయికృష్ణ, డీఈఈ(ఐటీడీఏ)

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ఏజెన్సీ గ్రామాల్లో నివాసం ఉంటున్న ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదివాసీ కొలవార్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండిగ రవీందర్ బెల్లంపల్లి సబ్ కలెక్టర్ ఈఎస్ఎస్‌డీ మనోజ్‌ను కోరారు. సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు ఏళ్ల తరబడిగా కనీస సౌకర్యాలకు నోచుకోకుండా ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కొలవార్ సేవా సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు గొలిసెట్టి బాపు, నాయకులు యపాల సమ్మయ్య, మణికుమార్, మహేష్, శంకర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి

నెన్నెల: భూ భారతి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. డీటీ ప్రకాష్, ఆర్ఐ సులోచనను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

దేవాపూర్‌లో పోలీసుల కార్డన్‌సెర్చ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి గొల్లవాడ, రాంపూర్‌లలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. వాహనపత్రాలు సక్రమంగా లేని 47ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. నంబర్ ప్లేట్ లేని రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సైబర్ క్రైం, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలు, మూఢనమ్మకాలపై స్థానిక ప్రజలకు సీఐ శశిధర్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దేవాపూర్, కాసిపేట, మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్సైలు గంగారాం, ఆంజనేయులు, రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

నెన్నెల: గంగారాంలో యువకుడి ఆత్మహత్యకు కారకుడైన మంగళి తిరుపతి అనే వ్యక్తి ఇంటిపై దాడి కేసులో సంబంధం లేని వారిపై పోలీసులు కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో సోమవారం ఎమ్మెల్యేను కలిసి సంఘటన గురించి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మృతుడి కుటుంబాన్ని పరామర్శించి వివరాలు తెలుసుకొని కేసులో ప్రమేయం లేని వారికి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు శ్రీశైలం తెలిపారు.

తాండూర్ వాసవీక్లబ్‌కు ఉత్తమ అవార్డు



నూతన కార్యవర్గంతో వాసవీక్లబ్ ప్రతినిధులు

తాండూర్: మంచిర్యాల జోనల్ స్థాయిలో తాండూర్ వాసవీ క్లబ్ ఉత్తమ అవార్డును కైవసం చేసుకుంది. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని విష్ణు నాదాలయ కాలక్షేపమండపంలో వాసవీక్లబ్ జోనల్ సోషల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ క్లబ్‌ను జోనల్‌స్థాయి ఉత్తమ క్లబ్‌గా ఎన్నుకున్నారు. తాండూర్ వనిత సింధూర్ క్లబ్ కార్యదర్శిగా కోడిపాక మాధురి అవార్డు అందుకున్నారు. అనంతరం తాండూర్ వనిత సింధూర్ క్లబ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కేశెట్టి సువర్ణ, కార్యదర్శిగా కోడిపాక మాధురి, కోశాధికారిగా రాచకొండ కల్పన, సభ్యులుగా మైలారపు అక్షయ, బోనగిరి స్పందన, గందె శిరీష, కాసం సునీత, కాసన గట్టు వరలక్ష్మి, కౌెట్టి సంధ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు కౌెట్టి సంతోష్ కుమార్, మధుసూదన్, మణికృష్ణ, మహేష్, బాబూజీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

దండేపల్లి: ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడాలని జిల్లా బాలికాభివృద్ధి అధికారి విజయలక్ష్మి సూచించారు. దండేపల్లి కేజీబీవీని సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. మెనూ, వసతుల తీరును పరిశీలించారు. ఎస్వో భాగ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులకు షీ టీం అండ

మందమర్రిరూరల్: విద్యార్థినులకు షీ టీం అండగా ఉంటుందని ఎస్సై రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని జ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై ఉషా విద్యార్థినులకు షీ టీం విధులపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందికి గురిచేస్తే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ద్వారకలో అవగాహన సదస్సు

దండేపల్లి: మండలంలోని ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత, బాలబాలికల సమస్యలు, పరిష్కారాలు సైబర్ క్రైమ్, సెల్‌ఫోన్ వాడకం, దానివల్ల కలిగే లాభ నష్టాలు, నిరుపేద బాలికలకు ప్రభుత్వం తరపున అందించే సహాయ సహకారాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళ సాధికారత జిల్లా కో ఆర్డినేటర్స్ విజయ, లిప్సిక, హెచ్ఎం చిన్ననర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో సోమవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్, ప్రగతిశీల భవన నిర్మాణ అడ్డా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

భీమన్న ఆలయంలో 24గంటల భజన

భీమిని: వర్షాలు కురవాలని, పంటలు సంవృద్ధిగా పండాలని కోరుతూ కన్నెపల్లి మండలంలోని మొత్కుపల్లి భీమన్న ఆలయంలో మాలీ సంక్షేమ సంఘం కులస్తులు సోమవారం 24గంటల భజన (ఎక్కాహం) చేపట్టారు. కన్నెపల్లి నుంచి మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భాజభజంత్రీలతో, మంగళహారతులతో భీమన్న ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెండే సత్యనారాయణ, మాలీ సంక్షేమ సంఘం కులస్తులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలపై సమీక్ష

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవీ శ్రీనివాసరావు సోమవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకును సందర్శించారు. అనంతనం రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, స్టేట్ ఎంసీ మెంబర్ వి.మధుసూదన్ రెడ్డి, కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ పాల్గొన్నారు.

రాముని చెరువు శుభ్రం చేయాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని రాముని చెరువులో మురుగు నీరు చేరి అపరిశుభ్రంగా మారిందని, చెరువును పరిశుభ్రం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సోమవారం చెరువు కట్టపై స్వచ్ఛంద పౌరసేవా సంస్థ సభ్యులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తులా మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ గుడి పునర్నిర్మాణానికి శంకుస్థాపన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 కొత్త రోడ్‌లో పోచమ్మ ఆలయం పునర్నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. 40ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో తిరిగి నిర్మించడం కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

నేటి నుంచి మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశాలు

- శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సంస్థ స్థితిగతులపై కార్మికులకు వివరించేందుకు మంగళవారం నుంచి మల్టీ డిపార్ట్‌మెంటల్ టీంల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో సోమవారం ఆయన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 18వరకు ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. ప్రతీ రోజు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం టీం అధికారులు గనులు, డిపార్ట్‌మెంటల్ సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ టీంలకు ఇన్‌చార్జీలుగా ఏరియా ఎస్ఓటుజీఎంగా సత్యనారాయణ, ఇందారం ఓసీపీ పీఓలుగా ఏవీ రెడ్డిలను నియమించామన్నారు. అనంతరం గుర్తింపు సంఘం నాయకులు, అధికారులతో కలిసి జీఎం ఈ డిపార్ట్‌మెంటల్ సమావేశాలపై చర్చించారు. వీటిని ఏ విధంగా నిర్వహించాలో తెలియజేశారు.

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ స్థితిగతులు కార్మికులకు తెలియజేయడానికే ఈ నెల 11నుంచి 20వరకు ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం దేవేందర్ పేర్కొన్నారు. ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫస్ట్, సెకండ్ షిఫ్టుల్లో కమిటీ సమావేశాలు ఉంటాయని, సంస్థ ఆర్థిక పరిస్థితులు, బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన, ఉద్యోగుల సంక్షేమం, పని స్థలాల్లో రక్షణ చర్యల ఏర్పాట్లు, కార్మికుల సమయపాలన, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, ఏరియాలో ఉన్నటువంటి వనరుల వినియోగం, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్మికుల, యూనియన్ ప్రతినిధుల సలహాలు, సూచనలు యాజమాన్యానికి తెలియజేయనున్నట్లు జీఎం తెలిపారు.డిపార్ట్‌మెంటల్ కమిటీలో ఏజెంట్, ఫైనాన్స్ ఆఫీసర్, ఐఈడీ, గని మేనేజర్, మైన్ కమిటీ మెంబర్స్, యూనియన్ ప్రతినిధులు ఉంటారని వివరించారు. సంస్థను కాపాడుకోవడానికి ఉద్యోగులంతా రక్షణతో కూడిన సమష్టి కృషికి సహకరించాలని కోరారు.

'బ్లాస్టింగ్ కార్మికులకు న్యాయం చేయాలి'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో పనిచేస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు మస్టర్లు ఇవ్వడంలో న్యాయం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవీఆర్ ఓబీ సంస్థలో పనిచేస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు ప్రతినెల 26మస్టర్లు ఇవ్వాల్సి ఉండగా వాటిని తగ్గిస్తూ ఆర్థికంగా నష్టం చేస్తున్నారన్నారు. ఓపెన్ కాస్ట్ ప్రభావిత గ్రామాల నుంచి పనిచేస్తున్న ఈ కాంట్రాక్ట్ బ్లాస్టింగ్ కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోమన్నారు. వెంటనే అధికారులు స్పందించి వారికి నెలకు నిర్ణీత మస్టర్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీనెల మొదటి వారం వేతనాలు చెల్లించాలని, పే స్లిప్పులు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బొగ్గుబాయి వార్తలు

'రాజకీయ జోక్యం అరికట్టాలి'

శ్రీరాంపూర్: సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా అరికట్టాలని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జీ కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. బొగ్గు ఉత్పత్తి పెరుగుతూనే కార్మికుల సంఖ్య తగ్గుతుందన్నారు. పని భారంతో కార్మికులు సతమతం అవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణి సంస్థను బలహీనపరిచే నిర్ణయాలు తీసుకుంటున్నాయని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ రాష్ట్ర నాయకులు రామాకాంత్, రాజిరెడ్డి, అధ్యక్షుడు సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం ఆపివేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో నిధుల దుర్వినియోగం ఆపివేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కంపెనీ వాస్తవ లాభాలను ప్రకటించిన తర్వాతనే అందులో నుంచి సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను కేటాయించాలన్నారు. యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించి, అందులో నుంచి కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు.

నులిపురుగుల నిర్మూలనకు సహకరించాలి



నస్పూర్: మాత్రలు అందిస్తున్న వైద్య సిబ్బంది



మంచిర్యాలటౌన్: మాత్రలు వేస్తున్న అనిత, రాఫ్‌ఖాన్



దండేపల్లిలో...

- జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్

నస్పూర్: నులిపురుగుల నివారణకు అందరూ సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని మార్టిన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఒకటి నుంచి 19సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సబియ సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ సయ్యద్, వైద్యులు అనిత, శివ, ప్రతాప్, నామ్‌దేవ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు

మంచిర్యాలటౌన్: చిన్నారులందరికీ నులిపురుగులు నివారించేందుకు గాను ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్లు మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడ-3 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను చూర్ణం చేసి, నీటిలో కలిపి తాగిపించారు. కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్ జ్యోతి, పద్మ, అంగన్‌వాడీ టీచర్ నసీమ, అంగన్‌వాడీ ఆయా అబాబీ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

కోటపల్లి/దండేపల్లి/బెల్లంపల్లి/లక్సెట్టిపేట/భీమిని/వేమనపల్లి/మంచిర్యాలరూరల్ (హాజీపూర్): నులిపురుగులు నివారిస్తేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని కోటపల్లి ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు నిహారిక, హాజీపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి లహరి, దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సతీష్, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, లక్సెట్టిపేట వైద్యాధికారి సతీష్‌కుమార్, బెల్లంపల్లిలో ప్రిన్సిపాల్ అంజయ్య, వేమనపల్లి హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, భీమిని వైద్యుడు అనిల్‌కుమార్ సూచించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో వినతి

తాండూర్/భీమారం/కాసిపేట: తాండూర్ మండలం మాదారం పోలీస్‌స్టేషన్ సమీపంలోని, బోయపల్లి ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు ప్రజావాణిలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. భీమారంలో ప్రజవాణి నామమాత్రంగా సాగింది. ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. కాసిపేట మండలంలోని కోమటిచేను గ్రామపంచాయతీలోని కొత్తవరిపేట, లచ్చునాయక్ తండా, పాత వరిపేట గ్రామాలను కలుపుకొని నూతనంగా ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ప్రజావాణిలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్‌కు దరఖాస్తులు అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు అధికారులు స్పందించి గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని, లేనట్టైతే ఎన్నికలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు బహిష్కరించనున్నట్లు హెచ్చరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: విజయ్ ప్రకాంత్ - 9440208447
చెన్నూర్: తిరుపతి, ACO - 7997958206
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899